# ప్రేమ ధార

పొద్దున్ననగా బిల్డింగ్ పనికి వెళ్లిన సువర్ణ గుడిసెకు చేరే సరికి చీకటి పడుతోంది. ఇద్దరు పిల్లలు మట్టిలో ఆడుకుంటున్నవారల్లా అమ్మా అంటూ పరిగెత్తుకొచ్చారు. " నేను వచ్చేదాక రాసుకుంటూ ఉండాలని చెప్పాను ఆడుకుంటున్నారేంటి అని విసుక్కొని దగ్గరకు తీసుకొంది సువర్ణ.

కాళ్ళు చేతులు కడుక్కొని పొయ్యిముట్టించింది సువర్ణ. పిల్లల పుస్తకాలుసర్ది ఊడ్చింది. బియ్యం చాటలో పోసుకొని రాళ్ళేరుతోంది సువర్ణ.

మూడు వీధుల అవతలి భాగ్యరేఖ సువర్ణా అని పిలుచుకుంటూ గుడిసెలోకి వచ్చింది."ఇవాళ లేటయిందేమిటి" అని అడిగింది భాగ్యరేఖ.

కొత్తమేస్త్రీ సతాయిస్తున్న విషయం చెప్పబోయి ఎందుకులే అనుకుని ఆగిపోయింది సువర్ణ.

"హరిబాబు నీకోసం వచ్చాడు. నీవులేవని మాయింట్లో కాసేపు కూర్చుండి వెళ్లిపోయాడు. వెళ్లిపోయి అరగంటైంది." అంది భాగ్యరేఖ.

అరగంటకుపైగా సతాయించిన మేస్త్రీని తిట్టుకుంది సువర్ణ. ఎన్నాళ్ళకొచ్చాడు హరిబాబు. సువర్ణకు ఏవేవో జ్ఞాపకాలు. హరిబాబు కన్పించక మూడేళ్ళయిపోయింది. ఇప్పుడు మేస్త్రీవల్ల కలుసుకునే అవకాశం పోయింది. హరిబాబుని తానే దూరం చేసుకుంది. తాను చేసింది త్యాగమో నిస్సహాయతో తనకు తెలియదు. తనకు అలా చేయాలనిపించింది చేసింది. ఇప్పుడు కాస్త బాధ పడుతున్నది. అయినా తన నిర్ణయమే సరైనదని తన విశ్వాసం.

"ఏమైనా చెప్పాడా?" ఉత్సాహం కనపడనీయక అడిగింది సువర్ణ.

" మళ్ళీ వస్తాను. ఇంట్లోనే ఉండుమనండి అని చెప్పి వెళ్ళాడు. హరిబాబు" అంది భాగ్యరేఖ.

" పిల్లల్ని దగ్గరకు తీస్కున్నాడా !"

"ఆ ! మట్టిలో ఆడుతున్న పిల్లల్ని రమ్మని పిలిచాడు.కొద్దిసేపు మాట్లాడి ఏమైనా కొనుక్కొమ్మని డబ్బులిచ్చాడు. పిల్లల స్కూలు ఫీజుల కోసమని ఈ డబ్బు ఇచ్చివెళ్ళాడు. పొయ్యిమీద పప్పు ఉడుకుతుంది నేను వెళ్తాను." అంటూ డబ్బుయిచ్చి వెళ్ళిపోయింది భాగ్యరేఖ.

పిల్లలు కాళ్ళు చేతులు కడుక్కొని పుస్తకాలు తీసుకొని దీపం ముందు కూర్చున్నారు.

సువర్ణ వంట చేసి స్నానం చేసింది. కాస్త మంచి చీర కట్టుకుంది. ఒకటి రెండు చీరెలు తప్ప ఆమె చీరలన్ని సెకండ్ హ్యాండ్ చీరలే. అదేమిటో కానీ ఆమె ఏ చీర కట్టుకున్నా ఆకర్షనీయంగా ఉంటుంది. ముఖ్యంగా ఆ ముహంలోని ప్రసన్నత, చిరునవ్వు, నిండుతనం ఆనవ్వులో ఒక పరిపూర్ణత స్వచ్ఛత ఎదుటి వారిని ఇట్టే ఆకర్షిస్తుంది.

''హరిబాబు'' ఒక నిట్టూర్పు విడిచింది సువర్ణ.

హరిబాబు అపార్టుమెంటుల నిర్మాణ కంపెనీలో కొంత కాలం సుపర్వైజర్గా పని చేసాడు. సువర్ణకు అతని పరిచయం బిల్డింగ్ పనిలోనే.

హరిబాబు ! తన జీవితంలో ఒక అందమైన కల. ఒక ఊహాలోకాల జీవితం. ఆ కల పాతబడి పోయింది. సువర్ణలో జ్ఞాపకాల ప్రవాహం....

మొదట పలకరించినప్పుడు నీనవ్వులో పువ్వులున్నాయన్నాడు హరిబాబు. తాను మళ్ళీ నవ్వింది.

''నీవు నవ్వితే నాహృదయంలో ఏవో సంగీతశృతులు'' అన్నాడు హరిబాబు.

'' నీ పరిచయం లేకుండా నేను యిన్నాళ్ళు ఎలా బతికానా అని ఆశ్చర్యం వేస్తుంది సువర్ణా'' అన్నాడు హరిబాబు.

తాను మళ్ళీ నవ్వుతుంది. అతను ముంగురులు సవరిస్తాడు.

'' నీవు లేని జీవితాన్ని ఊహించలేకపోతున్నాను''హరిబాబు

''ఇప్పుడు నీ చెంతనే ఉన్నానుగా'' అంటుంది తాను.

'' నీవు నాకు కావాలి''

'' నేను నీదాన్ని. ఎప్పుడు కాదన్నాను''

'' నువ్వు ఎప్పటికి నాదానివి కావాలి''

'' నువ్వు ఎప్పుడు పిలుస్తున్నా వస్తూనే ఉన్నానుగా''

'' మనం పెళ్ళి చేసుకొందాం. ఎక్కడికైనా లేచిపోదాం''

'' హరిబాబు ! నేను నీవు పిలిచినప్పుడల్లా వస్తాను. పెళ్ళిమాట ఎందుకు''

'' అలా కాదు సువర్ణా ! పెళ్ళయ్యాకే నీమీద నాకు హక్కు వస్తుంది. నా జీవితానికి స్థిరత్వం ఏర్పడుతుంది.

'' హరిబాబు ! మన పెళ్ళయి నామీద నీకు హక్కులు వచ్చాక నేనింత కావల్సిన దానిలా ఉండనేమో. కొన్నాళ్ళకే నామీద నీకు విసుగొస్తుందేమో.అందరూ భర్తల్లా నీవు నన్ను సాధించడమే మిగిలి ప్రేమ ఎగిరిపోతుంది''.

'' సువర్ణా ! నన్నూ అందరిలాంటి వాన్ననే అంటావా ! అలుగుతాడు హరిబాబు.

'' కాదు నువ్వు నా హరిబాబువి. నాకలల లోకానివి''

'' సువర్ణా ! నీ ప్రేమధార నామీద ప్రవహిస్తు ఉండాలి''

'' అతని కౌగిలిలో తాను తన కౌగిలిలో అతడు.

'' సువర్ణా ! నిన్ను తప్ప నేను ఎవర్నీఎరుగను''

తాను నవ్వుతుంది.

'' హరిబాబు ! నాకు పెళ్ళయిందని నీకు తెల్సు. ఒక బాబుకూడా ఉన్నాడని తెల్సు''

'' అయినా సువర్ణా ! మనం లేచిపోయి పెళ్ళిచేసుకుందాం బాబు మనతోనే ఉంటాడు''

తాను ఏవేవో చెప్పి వాయిదా వేస్తుంది. అతను విసుక్కుంటాడు.

రోజులు గడిచాయి. అనుమానంతో భర్త తన్నులు, ఎన్నో తిట్లు, హరిబాబు కోసం అన్నీ భరించింది తాను. తాను అతన్ని ఎందుకు వదులుకోలేకపోయింది.అతని నవ్వు మల్లెపువ్వంత తెలుపు. అతని హృదయం నిండా నిర్మలమైన ప్రేమ. అతని కళ్ళల్లో ఉన్నది కామం కాదు. ప్రేమ రాహిత్య ఎడారి జీవితంలో ఒయాసిస్సు దొరికిన ఆనందం.

తానతనితో ఎందుకు లేచిపోలేకపోయింది. అతనంటే తనకు ప్రాణం. అతని జీవితం ఒడిదొడుకుల పాలవకూడదని ఆరాటం. పెళ్ళయిన స్త్రీతో లేచిపోయిన జీవితం సుఖంగా సాగుతుందో లేదో. అతని కన్నా తనకే భయం. తన పూర్వానుభవం భయపెడ్తుంది.

తన భర్త నిజంగా అతడు భర్తేనా ! టీ హోటల్ యజమాని అతను. రాగాపోగా పరిచయం అయింది. అతనికి ఆదివరకే పెళ్ళయింది. పిల్లలు.

అన్నీ తెలిసి సూరిబాబు వలలో పడింది తాను. సూరిబాబు తనకు వలవేశాడా ! తానే సూరిబాబుకు గతిలేక లొంగిపోయిందా ! తనకు మగతోడు కావాలి. మిగతా వాళ్ళనుండి రక్షణ కావాలి.

తాను ఏడ్చిన రాత్రులెన్ని. తానసలు ఏడ్వగలిగిందా ! అక్కయ్యకు పెళ్ళి చేయలేకపోయాడు నాన్న. పశువుల్లా అమ్ముడుపోయే మగాళ్ళను మగళ్ళుగా కొనుక్కురాలేకపోయాడు నాన్న.కూడు పెట్టని కులవృత్తి వదిలి బట్టలమిల్లు కార్మికుడయ్యాడు. ఇద్దరు పిల్లలయ్యారు. కొంతకాలం సాఫీగానే సాగింది. మిల్లుమూత పడింది. వేలాది మంది వృత్తికోల్పోయారు. తమ కుటుంబం బజారున పడింది. పుట్టిన ఊళ్లో ఉన్నదేమిలేదు.వలస వెళ్ళినచోట మిగుల్చుకున్నదీలేదు. మిల్లు మూత పడ్డాకా మరో ఊరికి వలస....

పిల్లల నెక్కర్లు, డ్రాయర్లు కుట్టడం వంటి చిన్నపని మాత్రం నేర్చిన చిన్న టేలరయ్యాడు నాన్న. వచ్చిన పైసలు తిండికే చాలవు. కూడబెట్టేదెక్కడ ! వలస ఒక ఊరినుండి మరో ఊరికి వలస...

అక్క నాన్న పెళ్ళి చేస్తాడేమోనని చూసి చూసి పాతికేళ్ళ వయసులో లేచిపోయింది. లేపుకుపోయినవాడు ఏ రెండేళ్ళకో వదిలేసి పోతాడేమో ననిఅనుమానం ఉన్నప్పటికీ లేచిపోయింది. లేచిపోయిన అక్కయ్య యింటికి రాలేదు. అతడు వదిలేశాక ఆరునెలలు ఒంటరిగానే ఉంది. ఎలాగైందో పరిచయం లాడ్జిలకు పిల్చినప్పుడల్లా వెళ్ళి వచ్చేది. రెండేళ్ళకు మరొకరెవరో ఉంచుకున్నారు. అతనికి అదివరకే పిల్లలు. రకరకాల వ్యసనాలు. డబ్బుకోసం వేధించేవాడు. అక్క లాడ్జింగులు తిరగక తప్పేది కాదు. ఇద్దరు పిల్లలయ్యాక అతడిని వదిలేద్దామనుకుంది. కాని రోజు డబ్బులు తెచ్చే ఆమెను అతడు వదలలేకపోయాడు.

నాన్న తనకుకూడా పెళ్ళిచేయలేడని తనక్కూడా తెల్సిపోయింది.పైగా అక్కలేచిపోయిందని అపవాదు ఒకటి. తన ప్రేమ విషయం అమ్మకు తెల్సు. ఏమనలేకపోయింది. అతనితోనే లేచిపోయింది. శేఖరం మంచివాడే.కానీ జీవితం అతన్ని ఆశపెట్టింది. ఏ ఆధారంలేని తనను వదిలేయడం సులభం అని గుర్తించాడు.అతను వదిలేసినా అమ్మానాన్నలుఅతన్ని ఏమీచేయలేరని అతనికి తెల్సిపోయింది.

శేఖరం తన అమ్మా నాన్న, చెల్లెలు గురించి వారి బతుకుగురించిన బెంగగురించి ఏదేదో చెప్పాడు. చూసి వారం రోజుల్లో వస్తానన్నాడు. రాడని తెల్సిఏమీచేయ లేకపోయిందితాను. కట్నంతో సహా కొత్తభార్యదొరికింది. తనకొచ్చిన కట్నంతో చెల్లెలి పెళ్ళి చేశాడు.

శేఖరం పారిపోయాక ఏడాది దాకా తన బతుకు తాను బతికింది.తర్వాత సూరిబాబుతో పరిచయం.ఇప్పుడు శేఖరం ఒక బడాబాబు. కానీ తనముందు అతనికి ముఖం చెల్లదు.శేఖరం నిజానికి మంచివాడే. రెండవ భార్యగానైనా ఉంచుకుంటాడని ఆశించింది. కాని అతడు తప్పించుకు

తిరిగాడు. ఇప్పుడు హరిబాబుతో లేచిపోతే మళ్లీ శేఖరంలా ముఖం చూసుకోలేనిదశ వస్తుందేమోనని తనభయం. ఆ స్థితిని తాను భరించలేదు. వాస్తవాలు హరిబాబుని ఎప్పటికైనా శేఖరం లాగే కొత్త జీవితం కొత్తభార్య అనే ఆశవైపుకు నడిపిస్తాయి అని తాను నిరాకరించింది.

పైగా తాను అప్పటికే సూరిబాబుకు రెండో భార్య... పేదరికం విధించిన కష్టాలు. ఆడపుటక విధించిన పరిమితులు. తానూ ఒక యిల్లాలైంది. తనకంటూ ఓగుడిసెవేసుకుంది. నగరంలో తనకంటూ జానెడు స్థలం.

కష్టాలు తీరలేదు. ఇంట్లోకి ఒక్కపైసా యిచ్చేవాడుకాదు సూరిబాబు. తాను సంపాదించినవే ఎత్తుకుపోయేవాడు. తాను పనికి వెళ్ళక తప్పలేదు. లాడ్జింగులకు వెళ్ళక తప్పలేదు. ఫ్యామిలి టైపు కావాలన్నప్పుడే తనని పిలిచేవారు.

శరీర కష్టంతో బతకాలనుకున్న తన నిర్ణయాలు సాగలేదు. బిల్డింగ్ పనికి వెళ్తే మేస్త్రీల బెడద కూలి తక్కువ. ఆకూలి పని ప్రతిరోజు యిప్పించాలంటే లొంగిపోక తప్పని పరిస్థితి కల్పించడం. పొద్దంతా పనిచేసి కష్టించినా తప్పని సతాయింపులకన్నా రెట్టింపు డబ్బిచ్చి పువ్వుల్లో పెట్టుకొని పూజించే వాళ్ళే నయమనిపించింది. అయినా లోకం కోసం ఏదో ఒక వృత్తి చేయక తప్పదు. అలా బిల్డింగ్ పనికి వెళ్తూనే ఉంది.

అలా హరిబాబు తన జీవితంలో ప్రవేశించాడు. ఏమీ తెలియని అమాయకత్వం. తాను అతన్ని తనబిడ్డను హృదయానికి హత్తుకున్నట్టే హత్తుకునేది. రోజులు గడుస్తున్న కొద్దీ అతడు ఎదగడం ప్రారంభించాడు. ఏవేవో ఆదర్శాలు.

" సువర్ణా ! నీవు ఎటూకాని నీ జీవితం ఎన్నాళ్ళు జీవిస్తావు. కేవలం కట్నం యివ్వలేని స్థితికి నీబతుకు యింత ఘోరం కావాలా! మనం పెళ్ళి చేసికొందాం సువర్ణా.

"హరిబాబు ! నాకు యితరులు చూపే జాలి అంటే అసహ్యం. జాలితో నన్ను పెళ్ళి చేసుకోవద్దు."

" సువర్ణా ! జాలితో కాదు. నేను ప్రేమతో అడుగుతున్నాను అరాచకంగా జీవిస్తున్న నాకు జీవితాన్నిచ్చావు. మనం పెళ్ళి చేసుకుందాం నామీద ఆధారపడ్డవాళ్ళెవరులేరు. అన్నయ్యలు ఉద్యోగాలు చేస్తున్నారు. అమ్మానాన్నలు వాళ్ళ వద్దే వుంటారు. మనం స్వేచ్ఛాజీవులం"

" హరిబాబు ! పెళ్ళయికొన్నాళ్ళు కాపురం చేసి శేఖరంలా ముహం చూసుకోలేకపోవడం నాకెంతో కష్టం వేస్తుంది. నాజీవితాన్ని తీసుకున్న శేఖరం యివాళ నాకు దూరంకావడానికి లేచిపోయి పెళ్ళిచేసుకోవడమేకారణం. ఆ పెళ్ళంటూ జరగకపోతే అతను మోసంచేశాననే అపవాదు మోసేవాడు కాదు. స్నేహితుడిలా కలుస్తూ ఉండేవాడు. మళ్ళీ అలా నిన్ను కోల్పోదల్చుకోలేదు. నీ ఆపాయ్యత కావాలి. నీవు ఎక్కడున్నా నావాడనే విశ్వాసం నాకుండాలి. నీవు మంచివాడుగా మిగిలిపోవాలి" నవ్వుతూ అంది తాను. ఎంతో దుఃఖాన్ని కడుపులో దాచుకొని.

..... ఆరోజు నవ్వులాటనుండి సీరియస్ అయిపోయాడు హరిబాబు.

" సువర్ణా ! మనం పెళ్ళిచేసుకుందామంటే ఏవేవో చెప్తావేంటి? నావద్ద నీకు తృప్తి లభించడంలేదా ! వాడే బాగా సుఖపెట్టాడా !."

తను కన్నీరు కార్చింది."హరిబాబు ! సుఖం అనేది సెక్సులో ఉండదు. తృప్తి అనేది హృదయానికి సంబంధించినది. హృదయాల కలయిక సుఖాన్ని, తృప్తిని యిస్తుంది అది అన్నిటిని జయిస్తుంది. అదిలేని సెక్సు గొడ్డలితో కట్టెలు కొట్టడం కన్నా హీనమై హృదయం పెచ్చులు పెచ్చులుగా రాలిపోతుంది. హరిబాబు ! నీవు పంచిన ప్రేమ నేను జీవితంలో మరచిపోలేను. మనం కల్సి జీవించిన క్షణాలు జీవితంలో మధురమైన ఘట్టాలు. ఈ జ్ఞాపకాలు జీవితాంతం నాలో పదిలంగా

ఉంటాయి.

" అయితే పెళ్ళెందుకు వద్దంటున్నావు."

" హరిబాబు ! వయస్సులో నీకన్నా కాస్త పెద్దదాన్ని, లోకం చూసిన దాన్ని. నాపైనీమోజు ఎంతకాలం ఉంటుందో తెలియదు. మోజు తీరాక అందరిలా నీవూ మారతావేమోనని భయం. నిన్ను అలా చెడ్డవాడిలా చూడలేను. శేఖరంలా కాకుండా నీ జ్ఞాపకాలు ఆదర్శవంతంగా ఉండాలి. నువ్వు పెళ్ళి చేసుకోవాలి, నీకు నచ్చిన అమ్మాయిని, అమ్మానాన్నలు మెచ్చిన అమ్మాయిని పెళ్ళి చేసుకోవాలి. ఆమెలో నన్ను చూసుకోవాలి. ఎవరికీ కనపడకుండా నీ హృదయంలో నాక్కాస్త చోటుండాలి. "

" ఏంటి సువర్ణా ! నువ్వు మాట్లాడుతున్నది. నేను ప్రేమిస్తున్నది నిన్ను. చేసుకుంటే నిన్నే పెళ్ళి చేసుకొంటాను. "

మళ్ళీ మాటా మాటా పెరిగింది. తనని మరీ అమాయకుడిగా భావిస్తూ హితబోధ చేస్తున్న సువర్ణ పై హరిబాబుకు చాలా కోపం వచ్చింది.

" నీకసలు బుద్ధుందా ! నేను చిన్న పిల్లాడిననుకుంటున్నావా ! నా ప్రేమ నీకు చిన్నపిల్లల ఆటల్లా ఉందా ! పెళ్ళికి అంగీకరిస్తావో లేదో చెప్పు " అంటూ తీవ్రంగా మాట్లాడాడు హరిబాబు. అసహనంతో కొట్టడానికి చెయ్యెత్తాడు.

సూరిబాబు చెయ్యెత్తితే తనకు కంపరం కలిగేది. హరిబాబు చెయ్యెత్తితే తనకు ఎంత ఆనందం వేసింది. ఆ చేత్తో తన రెండు చెంపలు వాయిస్తే ఎంత బాగుండేది. ఆ ఎత్తిన చెయ్యి తనపై గల ప్రేమకు నిదర్శనం, కానీ హరిబాబు తనను తనే అదుపు చేసుకొని ఎత్తిన చెయ్యి దించాడు. తనని కొట్టనందుకెందుకో నిరాశకలిగింది.

" హరిబాబూ ! నీ ప్రేమ నా హృదయంలో ఉండిపోనీ, నేనో కమ్మని కలలా నీ జ్ఞాపకాల్లో మిగిలిపోనీ. నేను నిన్ను ఎన్నడు కాదన్నానని. "

రోజులు గడిచాయి. రెండో బాబు తనలా లేడని సూరిబాబుకు కసి. తనకు తెల్సు. హరిబాబును తనలో ఒక శిశువుగా మార్చుకోవాలనుకుంది. హరిబాబే పిల్లాడై తన ఒడిలో ఆడుకోవాలనీ. తన పాలు తాగాలనీ. " చిన్న " హరిబాబు ప్రేమకు చిహ్నం.

" వీడు నా కొడుకు. నువ్వే నా కొడుకుగా ... " చిలిపిగా నవ్వింది తాను.

తనకు కొడుకు పుట్టిన ఆనందం హరిబాబులో ఎంత ఎదుగుదల తెచ్చిందో. ఆత్మవిశ్వాసంతో హృదయం ఎంత ఉప్పొంగిందో తనకు తెల్సు.

హరిబాబు బిల్డింగ్ కన్స్ట్రక్షన్ కంపెనీలో ఉద్యోగం వదిలేశాడు. మరో మంచి పని దొరికింది. ఊరు మారింది. రాకపోకలు తగ్గాయి.

పెళ్ళయ్యాక ఏడాది తిరక్కుండానే తండ్రయ్యాడు హరిబాబు.

అతని జీవితం మరో మలుపు తిరిగినపుడు ఆ రోజు హరిబాబు ఎంత విచిత్రంగా ప్రవర్తించాడు.

" సువర్ణా ! నాకు జీవితాన్నిచ్చావు. ఆత్మవిశ్వాసాన్నిచ్చావు. నీ మేలు నేను జీవితంలో మరిచిపోలేను. నీవు కుంతీ మాతవు. కాదు - ద్రౌపదీ దేవివి. కాదు. మధురవాణివి - కాదు - నువ్వు నా హృదయేశ్వరివి. నన్ను అరాచక జీవితం నుండి ప్రేమను పంచి మనిషిగా తీర్చిదిద్దిన మనీషివి నీవు. " అంటూ కాళ్ళ మీద పడ్డాడు హరిబాబు.

" ఏంటి హరిబాబూ ! ఏం పని యిది ! దేవతలతో ఈ చెడిపోయిన దానికి పోలికేమిటి బాబూ ! తప్పు " అంటూ లేవదీసింది తాను.

" సువర్ణా ! నా దేవికి ! నా దేవతకు నేను పాదాభివందనం చేసుకుంటున్నాను. " అంటూ మళ్ళీ

పాదాలు స్పృశించి కన్నీరు కార్చాడు. అవి ఆనందభాష్పాలన్నాడు. తనని ఒక అపార్టుమెంటు కంపెనీలో వర్కింగ్ పార్ట్‌నర్‌గా తీసుకున్నారన్నాడు. తనకెంతో సంతోషం కలిగింది. ఆ రోజు తనకు పిల్లలకు కొత్త బట్టలు తెచ్చాడు.

హరిబాబు దూరమయ్యాక సూరిబాబు హింస పెరిగిపోయింది. హరిబాబు వస్తున్నంతకాలం అతనితో లేచిపోతుందేమో అనే భయంతో దాష్టీకం తగ్గించుకున్నవాడల్లా పెట్రేగిపోయాడు సూరిబాబు.

తన సొంత భార్య తాలూకు పిల్లల్ని ప్రయివేటు స్కూల్లో చేర్చాడు సూరిబాబు. తన పిల్లల్ని గవర్నమెంటు స్కూల్లో వేశాడు. స్కూలులో వేశాడని పేరే గానీ పిల్లలతో ఎపుడూ హోటల్లోనే క్లీనర్సుగా పని చేయిస్తాడు. అతన్ని తిట్టి తనను తిట్టుకుని కన్నీరు కార్చినా మారని స్థితి.

తన జీవితంలో ఒక వెలుగు, ఒక అధ్యాయం ముగిసిపోయింది. పిల్లలు పెరుగుతున్నారు. వారే తన ఆశ. పెరిగాక వాళ్ళేం అంటారో. అప్పటికి సూరిబాబు వదిలేస్తాడో, ఉంటాడో. నేనా పని చేయను, డబ్బులివ్వను. పిల్లల్ని చదివించుకుంటాను. హోటలుకు పంపను అని ఖరాఖండిగా చెప్పడంతో సూరిబాబు రావడం తగ్గించాడు.

కష్టాల్ని ఎవరికీ చెప్పుకోలేని ఒంటరితనం. ఒంటరిజీవితంలో అపుడపుడు అన్పిస్తూ ఉంటుంది- హరిబాబును దూరం చేసుకొని తాను పొరపాటు చేసిందా ! తనది ప్రేమా ! త్యాగమా ! నిస్సహాయ స్థితా ! అతనితో పెళ్ళి జరిగి ఉంటే ఎలా ఉండేది. బతుకు యింత దుర్భరంగా ఉండేది కాదేమో. అతను వదిలేసినా జీవితమంతా అతని పేరుమీదే బతికే అవకాశం ఉండేదేమో. కొన్నాళ్ళయినా నాన్నను మామయ్యా అని అమ్మను అత్తమ్మా అని పిలిచే అదృష్టాన్ని తానే కాలరాసిందా ! జీవితంలో అలా పిలిపించుకునే అదృష్టం లేదా ! అమ్మానాన్నలు అంత పాపం ఏం చేశారని. నాన్నకు కళ్ళు సరిగ్గా కనపడ్డం లేదు. టేలర్ వృత్తి సాగడం లేదు. హరిబాబుతో తన పెళ్ళయి ఉంటే నాన్నకు ఏదో కన్‌స్ట్రక్షన్ జరిగే చోట వాచ్‌మెన్‌గానైనా పని యిచ్చేవాడేమో ... నాన్నా ! నువ్వెంత దురదృష్టవంతుడివి. మామయ్యా అని పిలిపించుకోలేని దురదృష్టవంతుడివి.

హరిబాబుని ఈ రోజు చాలా విషయాలు అడగాలి. పిల్లల్ని ఆ స్కూల్లోంచి తీసి మరో స్కూల్లో వేయాలి. మంచి బట్టలు కొనాలి. ఆర్థికంగా కాస్త సాయం చేస్తాడేమో అడగాలి. ప్రేమ భావానికి వాస్తవిక జీవితానికి వంతెన ఏ మేరకు సాధ్యమో తేల్చుకోవాలి. అపుడు హరిబాబు తనని పెళ్ళి చేసుకొంటానన్నాడు. ఇప్పుడతనికి పిల్లలయ్యారు. ఇపుడు కనీసం తనని ఉంచుకుంటాడేమో అడగాలి. అమ్మను అత్తమ్మ అని, నాన్నను మామయ్యా అని పిలుస్తాడేమో అడగాలి. అతని పేరు మీద బతికే అవకాశం యిస్తే చాలు. అతను తనకు సర్దనక్కర లేదు. కూలిపనైనా చేసుకుని బతుకుతుంది. అందుకు హరిబాబు అంగీకరిస్తే తనకు తోడుగా అమ్మానాన్నల్ని రమ్మంటుంది. అతని పేరు మీద బతకగలిగితే చాలు. అందుకు అతడు అంగీకరిస్తే చాలు ...

పిల్లలు తినకుండానే నిద్రపోయారు. భాగ్యరేఖ యిచ్చిన మల్లెలు తలలో పెట్టుకుంది సువర్ణ. హరిబాబు కోసం ఎదురు చూస్తోంది సువర్ణ.

అతని పేరు మీద బతకడానికి హరిబాబు అంగీకరించకపోతే ! అలా అన్పించుకోవడం కన్నా హరిబాబు రాకపోవడమే మంచిదని కోరుకుంది సువర్ణ. అలా కనీసం తాను కలలుకనే ఆశ మిగిలి ఉంటుంది. హరిబాబు వస్తాడు. రావాలి. అంగీకరిస్తాడు. అని కోరుకుంది మరోపక్క. అతను అంగీకరించకపోయినా తనకుతానే అతని పేరు మీద బతుకుతుంది. అందుకు 'చిన్న'యే సాక్ష్యం. మరొకరి సాక్ష్యం దేనికి అనుకుంది సువర్ణ.

గుడిసె తలుపు ఓరగా వేసి ఒరిగింది సువర్ణ. రాత్రి గడిచిపోయింది. హరిబాబు రాలేదు.

తెల్లవారింది. హరిబాబు రాలేదు. సువర్ణ గబుక్కున లేచింది. ఒక కమ్మని కల కరిగిపోయింది. ఒక ఆశ చెరిగిపోయింది. కళ్ళల్లోంచి కన్నీరు చెలిమలయ్యాయి.

ఏదో అర్జెంటు పని తగిలి హరిబాబు రాలేకపోయాడు. ఎప్పుడో ఒకప్పుడు తప్పక వస్తాడని నిరీక్షిస్తోంది సువర్ణ. ఏ ఆశా లేకుండా జీవించడం ఎంత కష్టం. తన ఆశ నిరాశ కాకూడదు అనుకుంది సువర్ణ.

రోజులు గడుస్తున్నాయి. హరిబాబు తనకోసం రాకూడదనుకుంటూనే హరిబాబు కోసం ఎదురుచూస్తూ ఉంది సువర్ణ. అతని పేరు మీద బతకాలని అడుగుదామనుకోవడం వల్ల యిలా అయిందేమోననుకుంది సువర్ణ. ఇక అడగకూడదు. అడిగి నిరాశపడకూడదు. అతన్నించి ఏమీ ఆశించకూడదు. ఈ మధురమైన జ్ఞాపకాలు ఒక కమ్మని కలగా యిలాగే మిగిలిపోనీ. అతను రావద్దు. తన కలలు, ఆశలు చెదిరిపోవద్దు అని మనస్సు నిబ్బరం చేసుకొంది సువర్ణ. అయినా సువర్ణ హరిబాబుకోసం ఎదురుచూస్తూనే ఉంది. అతని పట్ల ఆమె ప్రేమధార ప్రవహిస్తూనే ఉంది కన్నీరై - సెలయేరై. ఉదయం పిల్లలు లేవకముందు అమ్మా ! నాన్నా ! నా బతుకిలా ఎందుకైపోయింది, కట్నం ఇవ్వలేని నిస్సహాయతకు జీవితాలు యిలా బలికావల్సిందేనా. మిల్లు మూసేసిన యజమాని బాగానే ఉన్నాడు. అతన్ని ఎవరు ఏమీచేయలేకపోయారు.నాన్నా ! అమ్మా ! నన్నెందుక్కన్నారే... అని కుమిలి కుమిలి ఏడుస్తూనే ఉంది. భాగ్యరేఖ అపుడపుడు వచ్చి కన్నీరు తుడుస్తూ ఉంటుంది.

సువర్ణను ఓదార్చడానికి భాగ్యరేఖ ఒక్కరైనా ఉన్నారు. భాగ్యరేఖను ఓదార్చడానికెవరున్నారు. ఆమె కన్నీరు యింకిపోయింది. వాళ్ళిద్దరు అక్కచెళ్ళెల్లని లోకానికి తెలియదు. తెలియకుండా బతుకుతున్నారు. తెలిస్తే ఎన్నో సమస్యలు ... సువర్ణ కల నిజం కావాలని భాగ్యరేఖ ఆశ. నిరాశవుతుందని తెల్సినా వదులుకోలేని ఆశతో సువర్ణ ....

❋ ❋ ❋